
ఎర్రగడ్డ బస్టాప్‌లో షెల్టర్ లేక రోడ్డుపైన బస్సుల కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు


కృష్ణకాంత్ పార్కు, సాయిబాబా ఆలయం వద్ద షెల్టర్ లేని బస్టాప్


ఈఎస్ఐ బస్టాప్ వద్ద బస్ షెల్టర్ ఉన్నా తోపుడుబండ్ల వల్ల రోడ్డుపైనే ప్రయాణికులు

బస్సు ప్రయాణికులకు ఇక్కట్లు

చాలాచోట్ల షెల్టర్లు లేవు.. ఉన్నచోట నిరుపయోగం

ఎర్రగడ్డ, మే 30 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో చాలాచోట్ల బస్సు షెల్టర్‌లు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కొన్నిచోట్ల ఉన్నా ఉపయోగించుకోలేని దుస్థితిలో ఉన్నాయి. ఎర్రగడ్డ చౌరస్తాలోని బస్టాప్ వద్ద షెల్టర్ లేదు. ఈఎస్ఐ వద్ద ఉన్నా తోపుడుబండ్లు అడ్డంగా ఉండడంతో ప్రయాణీకులు షెల్టర్‌లోకి వెళ్లలేని పరిస్థితి.



ఎర్రగడ్డ మానసిక ఆస్పత్రి ఎదురుగా బస్సులు ఆగకున్నా నిర్మించిన బస్ షెల్టర్

బస్సులు ఆగని ప్రాంతాల్లో షెల్టర్లు..

కొన్ని ప్రాంతాల్లో ఆర్టీసీ బస్సులు ఆగవు. అసలు అక్కడ బస్టాప్ ఉండదు. కానీ, అధికారులు బస్సు షెల్టర్‌ను ఏర్పాటు చేశారు. అది ఎందుకో వారికే తెలియాలి. అలా ఎర్రగడ్డ టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ కార్యాలయం పక్కన కొన్ని బస్‌షెల్టర్లు, మానసిక ఆస్పత్రి ఎదురుగా మరికొన్ని, ఎర్రగడ్డ జాతీయ రహదారి హీరో హోండా షోరూం ఎదురుగా బస్సు షెల్టర్లను ఏర్పాటు చేశారు. ఇక్కడ బస్సులు ఆగవు. ప్రయాణికులు ఉండరు.

రోడ్డుపైనే ప్రయాణికులు..

ఎర్రగడ్డ రైతుబజార్ వద్ద బస్టాప్ ఉన్నా వాహనాల పార్కింగ్‌కే పరిమితం అవుతోంది. అమీర్‌పేట సారథి స్టూడియో వద్ద బస్సు షెల్టర్ లేక ప్రయాణికులు రోడ్డుపైనే బస్సుల కోసం నిరీక్షిస్తూ నానా తంటాలు పడుతుంటారు. యూసుఫ్‌గూడ బస్తీ, చెక్‌పోస్ట్, కృష్ణానగర్, వెంకటగిరి బస్టాప్‌లో సైతం బస్సు షెల్టర్లు లేకపోవడం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు స్పందించి బస్సు షెల్టర్లు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.



కల్యాణ్‌నగర్ వద్ద లేని షెల్టర్

విరిగిన మ్యాన్‌హోల్ మూత


ఖైరతాబాద్ రైల్వేగేట్ చౌరస్తా(రాజీవ్ కూడలి) వద్ద నాలుగు రోజుల క్రితం మ్యాన్‌హోల్ మూత విరిగి ప్రమాదకర స్థితిలో ఉన్నా జీహెచ్‌ఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదు. జాతీయ రహదారి పక్కన ప్రమాదానికి ఆస్కారం ఉన్న ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.
● ఖైరతాబాద్, ఆంధ్రజ్యోతి

సాంస్కృతిక యోధుడు గద్దర్

● సమాజ్‌వాదీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ.సింహాద్రి


సమావేశంలో మాట్లాడుతున్న ప్రొ.సింహాద్రి

తార్నాక, మే 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సామాజిక, సాంస్కృతిక రచనలతో వివిధ సామాజిక వర్గాలను ప్రభావితం చేసిన గొప్ప సాంస్కృతిక యోధుడు గద్దర్ అని సమాజ్‌వాదీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ.సింహాద్రి కొనియాడారు. తార్నాకలోని సమాజ్‌వాదీ పార్టీ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చలనచిత్ర రంగంలోని వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వ్యక్తులకు రాష్ట్ర ప్రభుత్వం గద్దర్ అవార్డులను ప్రకటించడం సంతోషంగా ఉందన్నారు. గద్దర్ తన ఆటాపాటలతో అణగారిన వర్గాలను చైతన్య పరచడమే కాకుండా, అనేకమంది కవులకు, కళాకారులకు, ఉద్యమనాయకులకు స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. తెలంగాణ సాధనలోనూ గద్దర్ కీలకపాత్ర పోషించారని గుర్తు చేశారు. హైదరాబాద్‌లో గద్దర్ విగ్రహం ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.


క్రీడాకారులను అభినందిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

విద్యార్థులు ఉన్నతస్థాయికి చేరాలి

ఎర్రగడ్డ, మే 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తమకు ఇష్టమైన రంగాన్ని ఎంచుకొని ఉన్నతస్థాయికి చేరాలని సంఘ సేవకుడు కళ్లెం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఎర్రగడ్డ జీటీఎస్ గ్రౌండ్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రస్థాయిలో జరిగే పోటీలకు అర్హత సాధించిన క్రీడాకారులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 1వ తేదీన జింఖానా గ్రౌండ్‌లో జరిగే తెలంగాణ రాష్ట్ర సబ్ జూనియర్ 11వ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ పోటీలకు కె.దీన, జె. దేదీప్ అర్హత సాధించారని తెలిపారు. ఇటీవల జరిగిన హైదరాబాద్ జిల్లా సబ్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో దీన మొదటి స్థానం, దేదీప్ రెండోస్థానంలో నిలిచారని పేర్కొన్నారు. వీరితో పాటు ఆర్థిక స్థోమత లేని ఎంతోమంది క్రీడాకారులకు ఉచితంగా శిక్షణ ఇస్తున్న కోచ్ అనిల్ తయ్యప్పను అభినందించారు.

సత్తాచాటిన ఏకాగ్ర చెస్ అకాడమీ క్రీడాకారులు


విజేతలను అభినందించిన ఏకాగ్ర చెస్ అకాడమీ నిర్వాహకులు

బంజారాహిల్స్, మే 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ చెస్ అకాడమీ, ఐక్యూ చెస్ అకాడమీ నిర్వహించిన చెస్ టోర్నమెంట్‌లో ఏకాగ్ర చెస్ అకాడమీ క్రీడాకారులు సత్తాచాటి ఛాంపియన్‌లుగా నిలిచారని అకాడమీ చీఫ్ కోచ్ చైతన్య సురేష్ తెలిపారు. శుక్రవారం జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్.11లోని ఏకాగ్ర చెస్ అకాడమీలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్‌కు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. తెలంగాణ చెస్ అకాడమీ నిర్వహించిన టోర్నమెంట్లో అండర్-9 బాలికల విభాగంలో అన్య రంగినేని ఛాంపియన్‌గా నిలవగా, యంగెస్ట్ ప్లేయర్‌గా శ్వాన నిలిచింది. ఐక్యూ చెస్ అకాడమీ నిర్వహించిన టోర్నమెంట్లో అండర్-13 బాలుర విభాగంలో చరత్ అశ్విన్ ఛాంపియన్‌గా నిలిచాడని తెలిపారు. అకాడమీలో సీఈఓ సందీప్ నాయుడు, చీఫ్ కోచ్ చైతన్య శిక్షణతో ఛాంపియన్‌గా నిలిచామని, గ్రాండ్ మాస్టర్స్ అవడమే తమ లక్ష్యమని విజేతలు పేర్కొన్నారు.

3 నుంచి విద్యార్థులకు ప్రత్యేక వర్క్‌షాపులు

● రాష్ట్రపతి నిలయం ఎస్టేట్ మేనేజర్ డాక్టర్ రజనీప్రియ

అల్వాల్, మే 30 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యావరణ దినోత్సవం 2025 సందర్భంగా సికింద్రాబాద్‌లోని రాష్ట్రపతి నిలయంలో జూన్ 3 నుంచి 5 వరకు మూడు రోజులపాటు విద్యార్థుల కోసం ప్రత్యేక వర్క్‌షాప్‌లను నిర్వహిస్తున్నామని రాష్ట్రపతి నిలయం ఎస్టేట్ మేనేజర్ డాక్టర్ రజనీప్రియ శుక్రవారం తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో పర్యావరణ అవగాహనను పెంపొందించడమే కాకుండా వారిలో సృజనాత్మకతను పోత్సహించడాన్ని లక్ష్యంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. 10 నుంచి 18 సంవత్సరాల వయస్సు కలిగిన విద్యార్థులు ఈ వర్క్‌షాప్‌ల్లో పాల్గొనవచ్చు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వర్క్‌షాప్‌లను నిర్వహిస్తున్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఇతర వివరాల కోసం 040-23560518లో సంప్రదించవచ్చు.

ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలి

గచ్చిబౌలి, మే 30 (ఆంధ్రజ్యోతి): కొండాపూర్ ప్రాంతంలోని ఇజ్జత్‌నగర్‌లో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని కోరుతూ సీపీఐ మండల కార్యదర్శి రామకృష్ణ మాదాపూర్ ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. నిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ సమస్య ఉంటుందని వివరించారు. ఇజ్జత్‌నగర్ గుండా కూకట్‌పల్లి వైపు వెళ్లేందుకు రోడ్డు నిర్మించడంతో ఈ సమస్య ఉత్పన్నమవుతున్నట్లు తెలిపారు. అసలే చిన్న రోడ్లు ఉన్నాయని, పెద్ద వాహనాలు రావడంతో బస్తీలో ట్రాఫిక్ సమస్యతో స్థానికులు నరకయాతన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు.

అప్పుల బాధతో వ్యాపారి ఆత్మహత్య

మారేడుపల్లి, మే 30 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధలు తట్టుకోలేక ఓ హోటల్ వ్యాపారి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మారేడుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ వెంకటేశం తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన మహ్మద్ పాషా(45) అడ్డగుట్టలో నివాసముంటూ మారేడుపల్లిలో రుబీనా కేఫ్ పేరిట హోటల్ నిర్వహిస్తున్నాడు. వ్యాపారంలో నష్టం రావడంతో పాటు వ్యాపారం కోసం చేసిన అప్పులు పెరిగాయి. అప్పుల బాధలు భరించలేక గురువారం రాత్రి హోటల్ గదిలోనే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న మారేడుపల్లి పోలీసులు మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.


టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన మేయర్ గద్వాల్ విజయలక్ష్మి
- బంజారాహిల్స్, ఆంధ్రజ్యోతి


నూతన కమిటీ సభ్యులతో కార్పొరేటర్ సంగీతాశ్రీనివాస్‌యాదవ్ దంపతులు

ధనలక్ష్మి సోనాబాయి ఆలయ నూతన కమిటీ

బంజారాహిల్స్, మే 30 (ఆంధ్రజ్యోతి): అమీర్‌పేట ధనలక్ష్మి సోనాబాయి ఆలయ నూతన కమిటీ శుక్రవారం నియామకమైంది. ఎల్లారెడ్డిగూడకు చెందిన చిన్నా ముదిరాజ్ చైర్మన్‌గా, సభ్యులుగా ఎన్.మధుర, వి.కృష్ణమోహన్, ఎ.హరిశంకర్‌గౌడ్, ఎం.అనిల్ కుమార్, ఎస్.విజయ్ యాదవ్, ఎక్స్ అఫిషియో సభ్యుడిగా మధుసూదన్ నియమితులయ్యారు. ఈఓ నరేందర్‌రెడ్డి, సికింద్రాబాద్ 3వ డివిజన్ ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ మధు, కార్పొరేటర్ వనం సంగీతాశ్రీనివాస్ యాదవ్, మాజీ ఎంపీ అజారుద్దీన్ కుమారుడు అసద్ సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఆలయ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని నూతన కమిటీ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో నేతలు వనం శ్రీనివాస్‌యాదవ్, కిరణ్ యాదవ్, శరత్‌గౌడ్, గణేశ్, నాగరాజు, మహేష్ ముదిరాజ్, చినబాబు, నరేష్ నరికెళ్ల, ప్రసాద్, రాజుయాదవ్ పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న ఖైరతాబాద్ డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మణ్

హక్కులపై అవగాహన ఉండాలి

బంజారాహిల్స్, మే 30 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం కల్పించిన మానవ హక్కులపై ప్రతీ ఒక్కరికి అవగాహన ఉండాలని ఖైరతాబాద్ డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మణ్ అన్నారు. ఎల్లారెడ్డిగూడ అంబేద్కర్‌నగర్ కమ్యూనిటీహాల్‌లో దళిత నాయకుడు ఎర్ర నగేష్ ఆధ్వర్యంలో శుక్రవారం పౌర హక్కుల దినోత్సవం జరిగింది. లక్ష్మణ్ మాట్లాడుతూ రాజ్యాంగం ప్రతి ఒక్కరికీ అనేక హక్కులను కల్పించిందని, వీటిపై అవగాహన లేక బడుగు, బలహీన వర్గాలు చాలా కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో దళిత నాయకులు కన్యాకుమారి, అనిత, సాయి మాదిగ, రమేష్, పల్లె నర్సింగ్‌రావు, కృష్ణమూర్తి, కొమ్ము బాబు, నాగరాజు, గొడుగు వినోద్, మారుతి, అంజలి పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి మృతి


రవీందర్‌రెడ్డి(ఫైల్)

బేగంపేట, మే 30 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్‌రెడ్డి వ్యక్తిగత కార్యదర్శి టి. రవీందర్‌రెడ్డి శుక్రవారం మృతిచెందారు. గత ఫిబ్రవరి 3వ తేదీన కోకాపేటలోని తన నివాసం నుంచి బేగంపేటలోని బీజేపీ కార్యాలయానికి ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. గోల్కొండ సమీపంలోకి రాగానే గుర్తు తెలియని వాహనం ఆయన ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో కిందపడ్డాడు. తలకు బలమైన దెబ్బతగలడంతో స్పృహ కోల్పోయాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు ఆయనను ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పి చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో శుక్రవారం ఆయన మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఆయన మృతికి మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్‌రెడ్డి, బీజేపీ యువనేత మర్రి పురురవారెడ్డి సంతాపం తెలిపారు. కుటుంబసభ్యులను ఓదార్చారు. శనివారం జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

సుగంధ చెట్ల నరికివేతపై ఫిర్యాదు

యూసుఫ్‌గూడ, మే 30 (ఆంధ్రజ్యోతి): యూసుఫ్‌గూడ నిమ్స్‌మేలో వాలీబాల్ కోర్టు పక్కన మూడు సుగంధ చెట్లను నరకడంతో క్యాంపస్ ఎస్టేట్ మేనేజ్‌మెంట్ అధికారి డాక్టర్ సత్యేంద్ర కుమార్‌కు తోట కార్మికుడు సమాచారం ఇచ్చాడు. శుక్రవారం ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీని

తెలంగాణ జాతిపితగా ప్రకటించాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ ఫెడరేషన్ సభ్యులు, వివిధ సంఘాల నాయకులు

పంజాగుట్ట, మే 30 (ఆంధ్రజ్యోతి): నిజాం నిరంకుశ వ్యతిరేక పోరాట యోధుడు, తెలంగాణ తొలి-మలిదశ ఉద్యమ నాయకుడు,మాజీ మంత్రి ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీని తెలంగాణ జాతిపితగా ప్రకటించాలని వివిధ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కొండా లక్ష్మణ్ బాపూజీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఫెడరేషన్ చైర్మన్ రాపోలు జ్ఞానేశ్వర్, ప్రధాన కార్యదర్శి పెద్ది జగదీష్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం, వివిధ సంఘాల నాయకులతో కలిసి జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ట్యాంక్‌బండ్ మీద ఉన్న బాపూజీ విగ్రహం వద్ద నిర్వహించనున్న సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. భౌగోళిక తెలంగాణతోపాటు సామాజిక తెలంగాణ సాధిస్తేనే బడుగుల జీవితాలు బాగుపడుతాయని భావించిన మహా నాయకుడు బాపూజీ అని అన్నారు. 1969లో తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని తట్టుకోలేక తన మంత్రి పదవికి రాజీనామా చేసిన గొప్ప నేత అన్నారు. అసెంబ్లీ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి బాపూజీని తెలంగాణ జాతిపితగా ప్రకటించి గౌరవించాలని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బాపూజీ విగ్రహాలు, జిల్లా కేంద్రాల్లో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వివిధ సంఘాల నాయకులు నిమ్మల వీరన్న, రఘురామ్ నేత, తడక యాదగిరి, చిక్క చంద్రమోహన్, రాజు నేత,నరేందర్,వేముల రాము, తదితరులు పాల్గొన్నారు.

మహారాణి అహల్యబాయి హోల్కర్ : చింతల


పారిశుధ్య కార్మికులకు చీరలను పంపిణీ చేస్తున్న చింతల, డాక్టర్ గాయత్రీదేవి

ఎర్రగడ్డ, మే 30 (ఆంధ్రజ్యోతి): హిందూ ధార్మిక కార్యక్రమాల నిర్వహణలో పేరొందిన మహారాణి అహల్యబాయి హోల్కర్ అని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి కొనియాడారు. మాల్వా సామ్రాజ్యపు మహారాణి అహల్యబాయి హోల్కర్ శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకొని బీజేపీ సెంట్రల్ జిల్లా మెడికల్ సెల్ కన్వీనర్ డాక్టర్ ఎంవీ గాయత్రీదేవి ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు శుక్రవారం చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అహల్యబాయి కుటుంబం హిందూ ధర్మాన్ని కాపాడినట్లుగా ప్రస్తుతం మోదీ ప్రభుత్వం హిందూ ధర్మ రక్షణకు ఎంతో కృషి చేస్తుందని ప్రశంసించారు. బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకాల దీపక్ రెడ్డి మాట్లాడుతూ అహల్యబాయి హిందూ ధర్మ రక్షణ కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా యుద్ధాలు చేశారని గుర్తు చేశారు. డాక్టర్ ఎంవీ గాయత్రీదేవి మాట్లాడుతూ అహల్యబాయి ఇండోర్, మహేశ్వర్ ప్రాంతాల్లో హిందూ ఆలయాలను నిర్మించి ప్రసిద్ధికి ఎక్కారన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కిలారి మనోహర్, నాయకులు కుంబాల గంగరాజు, ప్రేమ్‌కుమార్, దర్శనం నాగేశ్వరరావు, అట్లూరి రామకృష్ణ, గూడూరు శ్రీధర్‌రెడ్డి, ఈదులకంటి రాజేష్, విజయ్ కుమార్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ వచ్చాక మత్స్యరంగానికి గ్రహణం


సమావేశంలో మాట్లాడుతున్న మల్లేశం ముదిరాజ్

పంజాగుట్ట, మే 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గత ప్రభుత్వం మత్స్య సహకార సంఘాలను బలోపేతం చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మత్స్యరంగానికి గ్రహణం పట్టిందని తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు గుర్రాల మల్లేశం ముదిరాజ్ ఆరోపించారు. మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలకు ఈ బడ్జెట్లో రూ.125 కోట్లు కేటాయించాలని, ఉచిత చేపపిల్లలను వెంటనే పంపిణీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశోక్ ముదిరాజ్, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పండుగ బాలు ముదిరాజ్, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం(డి.ఎఫ్.సి.ఎస్)ప్రతినిధులు మన్నే రాజు, బాల్‌రాజ్ తదితరులతో కలిసి ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 33 జిల్లా మత్స్య సహకార సంఘాలు ఉండగా, 12 సంఘాలకు ఎన్నికలు నిర్వహించారని, మిగతా వాటికి ఎన్నికలు నిర్వహించలేదని తెలిపారు. ప్రతీ ఐదు సంవత్సరాలకు ఒకసారి ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా సంబంధిత అధికారులు పట్టించుకోలేదని ఆరోపించారు. గత ప్రభుత్వం మత్స్యకారుల అభివృద్ధి, సంక్షేమం కోసం వెయ్యి కోట్ల నిధులు ఇచ్చిందని, ఈ ప్రభుత్వం మత్స్యకారులను చిన్నచూపు చూస్తోందని విమర్శించారు. ఉచిత చేపపిల్లల పంపిణీలో భాగంగా గత ప్రభుత్వం చేపపిల్లల పంపిణీ కోసం సుమారు రూ.85.45 కోట్లు, రొయ్య పిల్లల కోసం రూ.22.36 కోట్లు మొత్తం రూ.102.81 కోట్లు కేటాయించగా, ప్రస్తుత ప్రభుత్వం గత ఆర్థిక సంవత్సరంలో రూ. 20 కోట్లు, ప్రస్తుత సంవత్సరం రూ.19.26 కోట్లు మాత్రమే కేటాయించిందని తెలిపారు. ఇవి సరిపోవని రూ.125 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. 2023-24లో చేపపిల్లలను పంపిణీ చేసిన మత్స్య రైతులకు దాదాపు రూ.70 కోట్లను ప్రస్తుత ప్రభుత్వం చెల్లించడం లేదని ఆరోపించారు. గత ప్రభుత్వం తమకు భరోసా ఇస్తే ఈ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తమ అభయహస్తంలో ముదిరాజ్ సామాజిక వర్గానికి ఇచ్చిన వాగ్దానాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మహాసభ నాయకులు, సహకార సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

మాన్‌సూన్ ఫాగింగ్ యాక్షన్ ప్లాన్ ప్రారంభం


కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు, ఎంటమాలజీ అధికారులు

హైదర్‌నగర్, మే 30(ఆంధ్రజ్యోతి): హైదర్‌నగర్ డివిజన్ సమతనగర్‌లోని జీహెచ్‌ఎంసీ వార్డు కార్యాలయంలో ఎంటమాలజీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో మాన్‌సూన్ ఫాగింగ్ యాక్షన్ ప్లాన్ కార్యక్రమాన్ని కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభం అవుతుందని, వారానికి ఓ రోజు దోమల మందు పిచికారీ చేసే పైలెట్ ప్రాజెక్ట్ తన చేతుల మీదుగా ప్రారంభించడం సంతోషంగా ఉందని అన్నారు. ఈ ఏడాది డివిజన్‌లో ఒక్క డెంగీ కేసు కూడా నమోదు కాకుండా చేయాలనే లక్ష్యంతో పనిచేయాలని ఎంటమాలజీ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంటమాలజీ అధికారులు వెంకటేశ్వరరావు, ఏఈ తేజశ్రీ, సూపర్‌వైజర్ పద్మ తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు ఎల్‌ఓసీ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

పేదల వైద్యసేవలకు సహకారం

● ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

బౌద్ధనగర్, మే 30(ఆంధ్రజ్యోతి): పేదల వైద్యసేవలకు సహకారమందిస్తామని సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుల్ల పద్మారావుగౌడ్ అన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గానికి చెందిన లాలాగూడ నివాసి వసంత, తుకారాంగేట్ నివాసి మణెమ్మల వైద్య సేవల నిమిత్తం రూ.మూడు లక్షల సీఎంఎల్‌వోసీ పత్రాలను సీతాఫల్‌మండిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వారి కుటుంబ సభ్యులకు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేదలు వైద్యసేవలు పొందేందుకు తమవంతు సహకారాన్ని అందిస్తున్నామని తెలిపారు. ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో సీతాఫల్‌మండిలోని తన కార్యాలయాన్ని సంప్రదించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ సుందర్, బాలరాజుగౌడ్, సుంకు రామచందర్, విజయ తదితరులు పాల్గొన్నారు.



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

● కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్

మారేడుపల్లి, మే 30 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదం చేస్తాయని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. మారేడుపల్లి పరిధిలోని నెహ్రూనగర్ పార్కులో సుబ్రహ్మణేశ్వర స్వామి ఆలయ మాజీ చైర్మన్ సంతోశ్‌యాదవ్ సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఎమ్మెల్యే శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించిన కాంగ్రెస్ నాయకుడు సంతోశ్‌యాదవ్‌కు ప్రత్యేక అభినందనలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో రిజర్వాయర్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. కాలనీ అసోసియేషన్ సభ్యులు, విఠలేశ్వర స్వామి ఆలయ చైర్మన్ గౌరీశంకర్, డివిజన్ నాయకులు వైష్ణవి, నందికంటి రవి, బాబూరావు, వెంకటరాజు, దేవేందర్, రాజయ్య మల్లేశ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జోనల్ కమిషనర్ రవికిరణ్, పాల్గొన్న డిప్యూటీ మేయర్ శ్రీలతారెడ్డి, కార్పొరేటర్లు

కార్పొరేటర్లతో జోనల్ కమిషనర్ సమావేశం

సికింద్రాబాద్, మే 30(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో కార్పొరేటర్లతో శుక్రవారం జోనల్ కమిషనర్ రవికిరణ్, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతారెడ్డి సమావేశాన్ని నిర్వహించారు. డివిజన్లలో నెలకొన్న సమస్యలపై వారు కార్పొరేటర్లతో చర్చించారు. వనమహోత్సవంలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, ఇంటింటికి వెళ్లి చెట్లను పంపిణీ చేయాలని సూచించారు. గతంలో ఈఈఎస్‌ఎల్ వలన విద్యుత్‌దీపాలు పనిచేయలేదని, ఇప్పుడు జీహెచ్‌ఎంసీ ద్వారా పనులు జరపాలన్నారు. వచ్చే వర్షాకాలంలో ముంపు వలన ఆటంకాలు కలగకుండా పనులను వేగవంతం చేయాలని, సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులను చేపట్టాలని, దోమల నివారణకు, వీధి కుక్కల బెడదకు తగిన చర్యలు చేపట్టాలని కార్పొరేటర్లు జోనల్ కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఎస్‌ఈ ఆశాలత, సిటీప్లానర్ శ్రీనివాసరావు, వెటర్నరీ చక్రపాణి, హర్టికల్చర్ అనిల్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

● కార్పొరేటర్ సామల హేమ

బౌద్ధనగర్, మే 30 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్‌లోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని స్థానిక కార్పొరేటర్ సామల హేమ అన్నారు. ఇందిరానగర్‌కాలనీ, వారాసిగూడల్లో అధికారులతో కలిసి శుక్రవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ ఓవర్‌ఫ్లో కారణంగా మురుగు నీరు రోడ్డుపైకి వస్తుందని స్థానికులు కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేశారు. వెంటనే మ్యాన్‌హోల్స్‌కు మరమ్మతులు చేయాలని ఆమె అధికారులను ఆదేశించారు. అనంతరం ఇందిరానగర్‌కాలనీలో ఉన్న బస్తీ దవాఖానాను ఆకస్మికంగా తనిఖీ చేశారు. బస్తీదవాఖానా నిర్వహణ, ఆస్పత్రిలో వసతులు, మందులపై మెడికల్ ఆఫీసర్ డా.మిట్టపల్లి సృజలను కార్పొరేటర్ అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జలమండలి మేనేజర్ కుశాల్, జీహెచ్‌ఎంసీ ఏఈ కౌశిక్ పాల్గొన్నారు.



వారాసిగూడలో మ్యాన్‌హోల్స్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్ హేమ



సమావేశానికి హాజరైన బీజేపీ నాయకులు

రాష్ట్రంలో బీజేపీ జెండా ఎగరడం ఖాయం

● పార్టీ సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్

చిలకలగూడ, మే 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జరిగే అన్ని ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరడం ఖాయమని పార్టీ పార్టీ సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ మెట్టుగూడ డివిజన్ అధ్యక్షుడు ఆదర్శ్‌ముదిరాజ్ నివాసంలో శుక్రవారం భరత్‌గౌడ్ అధ్యక్షతన కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీలో చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా అందరూ కలిసికట్టుగా పని చేయాలని సూచించారు. అన్ని ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని భరత్‌గౌడ్ అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సారంగపాణి, సికింద్రాబాద్ అసెంబ్లీ కన్వీనర్ కందాడి నాగేశ్వరరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి దివా, కమిటీ మెంబర్ శారదామల్లేశ్, రాష్ట్ర, జిల్లా నాయకులు నరేశ్‌మాదిగ, అంజన్న, ఆవుల గణేశ్, సరోజ, రాజేశ్ నాయుడు, నాగలక్ష్మి, శశికళ, వరుణ్‌యాదవ్, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హమాల్‌బస్తీలో అగ్ని ప్రమాదం

పద్మారావునగర్, మే 30 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో బన్సీలాల్‌పేట్ డివిజన్ హమాల్‌బస్తీలోని ఓ ఇంట్లో శుక్రవారం అగ్ని ప్రమాదం సంభవించింది. గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు. ప్రమాద సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. ఇంట్లోని గృహోపకరణాలు, ఇతర సామగ్రి, సర్టిఫికెట్స్ కాలిపోయాయని బాధిత కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ కుటుంబాన్ని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు కోరారు. మంటలను ఆర్పివేయడానికి సహకరించిన స్థానిక నాయకులు యాదగిరి, నేరేటి రవి, కుషాల్‌లకు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



దగ్ధమైన సామగ్రి

చిన్న తప్పిదం.. పెద్ద ప్రమాదం

నగరంలో రోజుకోచోట అగ్నిప్రమాదం
అవగాహనతోనే నివారణ

బౌద్ధనగర్ మే 30 (ఆంధ్రజ్యోతి): ఇటీవల నగరంలో అగ్నిప్రమాదాలు గణనీయంగా పెరుగుతున్నాయి. ఓ చిన్న నిర్లక్ష్యం వల్ల పెద్ద ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ప్రమాదాలు జరిగితే క్షణాల్లో ఆస్తినష్టం, ప్రాణనష్టం వాటిల్లుతుంది. మంటలను అదుపులోకి తెచ్చేందుకు అగ్నిమాపక యంత్రం వచ్చేలోపే జరగాల్సిన నష్టం జరిగిపోతుంది. అగ్నిప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన అవసరం. అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే డయల్ 100కు గాని, 101కు గాని కాల్ చేయాలి. ప్రమాదాల నివారణకు ప్రజలు పాటించాల్సిన జాగ్రత్తలపై పోలీస్, అగ్నిమాపక శాఖ సూచనలు మీకోసం..

● ఎలక్ట్రికల్ హీటర్లు, ఇస్త్రీపెట్టెలు, మిక్సీలు, వాషింగ్ మిషన్లు వాడేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి

● మహిళలు వంట చేసేటప్పుడు చీర కొంగును జాగ్రత్తగా పెట్టుకోవాలి. సిల్క్ చీరలు ధరించకుండా ఉంటే మంచిది

● వంట గదిలో ఫ్రిజ్‌ను ఉంచకూడదు

● గ్యాస్ లీకైతే వెంటనే కిటికీలు, తలుపులు తీసి వెలుతురు, గాలి వచ్చే విధంగా చేయాలి



● అగ్నిప్రమాదం సంభవించినప్పుడు లిఫ్ట్‌ను ఉపయోగించరాదు.

● ప్రమాదవశాత్తు దుస్తులకు నిప్పు అంటుకుంటే భయంతో పరుగులు పెట్టకూడదు

● షార్ట్‌సర్క్యూట్ జరిగిన వెంటనే కరెంటు సరఫరాను నిలిపివేయాలి. పొడి ఇసుకతో మంటలను ఆర్పివేయాలి

సాంస్కృతిక యోధుడు గద్దర్

● సమాజ్‌వాదీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ. సింహాద్రి

తార్నాక, మే 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సామాజిక, సాంస్కృతిక రచనలతో వివిధ సామాజిక వర్గాలను ప్రభావితం చేసిన గొప్ప సాంస్కృతిక యోధుడు గద్దర్ అని సమాజ్‌వాదీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ.సింహాద్రి కొనియాడారు. తార్నాకలోని సమాజ్‌వాదీ పార్టీ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చలన చిత్ర రంగంలో వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వ్యక్తులకు రాష్ట్ర ప్రభుత్వం గద్దర్ అవార్డులను ప్రకటించడం సంతోషంగా ఉందన్నారు. గద్దర్ తన ఆట పాటలతో అణగారిన వర్గాలను చైతన్య పరచడమే కాకుండా, అనేకమంది కవులకు, కళాకారులకు, ఉద్యమనాయకులకు స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. తెలంగాణ సాధనలోనూ గద్దర్ కీలకపాత్ర పోషించాడని ఆయన గుర్తు చేశారు. హైదరాబాద్‌లో గద్దర్ విగ్రహం ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న సమాజ్‌వాదీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ. సింహాద్రి



బీజేపీ కంటోన్మెంట్ బోర్డు నాలుగో వార్డు నూతన కమిటీ సభ్యులను ప్రకటిస్తున్న అధ్యక్షుడు సచిన్



బీజేపీ అడ్డగుట్ట డివిజన్ నూతన కార్యవర్గ సభ్యులు

బీజేపీ బలోపేతానికి కృషి

మారేడుపల్లి, మే 30(ఆంధ్రజ్యోతి): బీజేపీ బలోపేతానికి కృషి చేస్తానని పార్టీ కంటోన్మెంట్ బోర్డు నాలుగో వార్డు నూతన అధ్యక్షుడు సచిన్ ఖంకే అన్నారు. శుక్రవారం బీజేపీ కంటోన్మెంట్ బోర్డు నాలుగో వార్డు నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా రామకృష్ణ, అజయ్‌బాబు, కిషన్‌రాజ్, రాకేశ్, జనరల్ సెక్రటరీలుగా ప్రభాకర్, సరీష్‌కుమార్, సెక్రటరీలుగా శ్రావణ్‌కుమార్, మహేశ్వరి, రాజేశ్వరి, వైష్ణవి, కోశాధికారిగా మహేశ్‌లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ వార్డులోని బీజేపీ నాయకులందరిని కలుపుకుపోతూ పార్టీ పటిష్టతకు కృషి చేస్తానని చెప్పారు. పార్టీకి, ప్రజలకు సేవ చేయడానికి అవకాశం కల్పించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు టోపి శంకర్, విజయానంద్, సతీశ్, ప్రేమ్‌కుమార్, రాజ్ మల్లేష్, నాగభూషణ్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీ అడ్డగుట్ట డివిజన్ అధ్యక్షురాలిగా సౌందర్య

అడ్డగుట్ట: బీజేపీ అడ్డగుట్ట డివిజన్ అధ్యక్షురాలిగా గాజుల సౌందర్య ఎన్నికయ్యారు. బీజేపీ అడ్డగుట్ట డివిజన్ నూతన కార్యవర్గాన్ని సికింద్రాబాద్, మహంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎన్నుకున్నారు. డివిజన్ ప్రధాన కార్యదర్శులుగా గంబీరావుపేట సాయన్న, హరి, శివప్రసాద్, ఉపాధ్యక్షులుగా శ్రీధర్, దుర్గ, వసంతనాయక్, కార్యదర్శులుగా జ్ఞానేశ్వర్, విజయ్‌కుమార్, లక్ష్మణ్, కల్యాణి, కోశాధికారిగా మోహన్ ఎన్నికయ్యారని పార్టీ సీనియర్ నాయకుడు హంసరాజు తెలిపారు.

ఆది ధ్వని మ్యూజియంతో విద్యార్థులకు ఉపయోగం

● ఎన్‌ఎస్‌యూఐ ఓయూ అధ్యక్షుడు మేడ శ్రీనివాస్

ఉస్మానియా యూనివర్సిటీ, మే 30 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీలోని ప్రొఫెసర్స్ క్వార్టర్స్‌లో ఆది ధ్వని మ్యూజియం ఏర్పాటును స్వాగతిస్తున్నామని, ఇది విద్యార్థుల పరిశోధనలకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఎన్‌ఎస్‌యూఐ ఓయూ అధ్యక్షుడు మేడ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఆయన ఓయూలోని ఆర్ట్స్ కాలేజీ వద్ద విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆదివాసీ సాంస్కృతిక కళాత్మకలు అంతరించిపోతున్న సమయంలో ప్రొఫెసర్ జయధీర్ తిరుమల రావు వాటిని సేకరణకు పూనుకున్నారని, ఈ కళాఖండాలను ప్రస్తుతం స్టేట్ ఆర్ట్ గ్యాలరీ తెలుగు యూనివర్సిటీలో ఎనిమిది గదులలో ఉంచారని తెలిపారు. వాణిజ్య అవసరాలకు ఓయూ భూ ములు ధారాదత్తమయ్యాయని, శిథిలావస్థలో ఉన్న క్వార్టర్స్‌ను మరమ్మతు చేసి మ్యూజియంకు కేటాయిస్తే ఓయూకు వచ్చిన నష్టమేమీ లేదని అభిప్రాయపడ్డారు. ఓయూ భూములను కాపాడేందుకు ఎన్‌ఎస్‌యూఐ ఎప్పుడూ ముందుంటుందని తెలిపారు.



మాట్లాడుతున్న ఎన్‌ఎస్‌యూఐ ఓయూ అధ్యక్షుడు శ్రీనివాస్

కాంగ్రెస్ ప్రభుత్వంలో మత్స్యరంగానికి గ్రహణం



సమావేశంలో మాట్లాడుతున్న మల్లేశం ముదిరాజ్

పంజాగుట్ట, మే 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గత ప్రభుత్వం మత్స్య సహకార సంఘాలను బలోపేతం చేస్తే కాంగ్రెస్ ప్రభు త్వం వచ్చాక మత్స్యరంగానికి గ్రహణం పట్టిందని తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు గుర్రాల మల్లేశం ముదిరాజ్ ఆరోపించారు. మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలకు ఈ బడ్జెట్లో రూ.125 కోట్లు కేటాయించాలని, ఉచిత చేపపిల్లలను వెంటనే పంపిణీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశోక్ ముదిరాజ్, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పండుగ బాలు ముదిరాజ్, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం(డి.ఎఫ్.సి.ఎస్)ప్రతినిధులు మన్నే రాజు, బాల్‌రాజ్ తదితరులతో కలిసి ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 33 జిల్లా మత్స్య సహకార సంఘాలు ఉండగా, 12 సంఘాలకు ఎన్నికలు నిర్వహించారని, మిగతా వాటికి ఎన్నికలు నిర్వహించలేదని తెలిపారు. ప్రతీ ఐదు సంవత్సరాలకు ఒకసారి ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా సంబంధిత అధికారులు పట్టించుకోలేదని ఆరోపించారు. గత ప్రభుత్వం మత్స్యకారుల అభివృద్ధి, సంక్షేమం కోసం వెయ్యి కోట్ల నిధులు ఇచ్చిందని, ఈ ప్రభుత్వం మత్స్యకారులను చిన్నచూపు చూస్తోందని విమర్శించారు. ఉచిత చేపపిల్లల పంపిణీలో భాగంగా గత ప్రభుత్వం చేపపిల్లల పంపిణీ కోసం సుమారు రూ.85.45 కోట్లు, రొయ్య పిల్లల కోసం రూ.22.36 కోట్లు మొత్తం రూ.102.81 కోట్లు కేటాయించగా, ప్రస్తుత ప్రభుత్వం గత ఆర్థిక సంవత్సరంలో రూ. 20 కోట్లు, ప్రస్తుత సంవత్సరం రూ.19.26 కోట్లు మాత్రమే కేటాయించిందని తెలిపారు. ఇవి సరిపోవని రూ.125 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. 2023-24లో చేపపిల్లలను పంపిణీ చేసిన మత్స్య రైతులకు దాదాపు రూ.70 కోట్లను ప్రస్తుత ప్రభుత్వం చెల్లించడం లేదని ఆరోపించారు. గత ప్రభుత్వం తమకు భరోసా ఇస్తే ఈ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తమ అభయహస్తంలో ముదిరాజ్ సామాజిక వర్గానికి ఇచ్చిన వాగ్దానాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహాసభ నాయకులు, సహకార సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



రైల్వే ఉద్యోగిని సత్కరిస్తున్న తోటి ఉద్యోగులు

124 మంది ఉద్యోగ విరమణ

చిలకలగూడ, మే 30 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్‌లో వివిధ హోదాల్లో విధులు నిర్వహిస్తున్న 124 మంది ఉద్యోగులు శుక్రవారం పదవీవిరమణ చేశారు. వీరిని తోటి ఉద్యోగులు సత్కరించారు. వారంతా హెడ్ క్వార్టర్స్, సికింద్రాబాద్, హైదరాబాద్‌లతో పాటు లాలాగూడ వర్క్ షాపులో పనిచేశారు.

మాజీ ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి మృతి

బేగంపేట, మే 30 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్‌రెడ్డి వ్యక్తిగత కార్యదర్శి రవీందర్‌రెడ్డి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. గత ఫిబ్రవరిలో ఆయన బేగంపేటలోని బీజేపీ కార్యాలయానికి వస్తుండగా రోడ్డు ప్రమాదం జరిగిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమించి శుక్రవారం రవీందర్‌రెడ్డి మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి మృతిపట్ల తన ప్రగాఢ సానుభూతి తెలిపి కుటుంబ సభ్యులను ఓదార్చారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న యాదగిరి

ఉద్యమకారులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

● ఉద్యమకారుల జేఏసీ చైర్మన్ యాదగిరి

అడ్డగుట్ట, మే 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఉద్యమకారుల జేఏసీ చైర్మన్ యాదగిరి ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శుక్రవారం మారేడుపల్లి తహసీల్దార్ భీమయ్యగౌడ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం అడ్డగుట్టలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల స్థలం, ప్రతి నెల రూ. 30వేల పెన్షన్, రూ.20 లక్షల ఉచిత బీమా ఇవ్వాలన్నారు. 100 ఎకరాల్లో స్మృతివనం, ఉద్యమ కళాకారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వెంకటలక్ష్మి, మురళి, అంజమ్మ, కిష్టయ్య, అరుణ, స్వరూప, కోటేశ్వర్‌రావు, రవీందర్, రవి, సునీత, సాలమ్మ, అనురాధ, సామెల్, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో వ్యాపారి ఆత్మహత్య

మారేడుపల్లి, మే 30 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధలు తట్టుకోలేక ఓ హోటల్ వ్యాపారి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మారేడుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ వెంకటేశం తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన మహమ్మద్ పాషా(45) అడ్డగుట్టలో నివాసముంటూ మారేడుపల్లిలో రుబీనా కేఫ్ పేరిట హోటల్ నిర్వహిస్తున్నాడు. వ్యాపారంలో నష్టం రావడంతో పాటు వ్యాపారం కోసం చేసిన అప్పులు పెరిగాయి. అప్పుల బాధలు భరించలేక గురువారం రాత్రి హోటల్ గదిలోనే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న మారేడుపల్లి పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి

బోయినపల్లి, మే 30 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగిన ఓ వ్యక్తికి గుండెపోటు రావడంతో మృతి చెందాడు. ఈ సంఘటన బోయినపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ తిరుపతి రాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఓల్డ్ బోయినపల్లి షేర్‌గల్లీకి చెందిన మహమ్మద్ ఆరిఫ్‌వుద్దీన్ (43) గురువారం అర్ధరాత్రి సమయంలో గాంధీ ఐడియాలజీ సెంటర్ వద్ద తన ముగ్గురు స్నేహితులతో కలిసి బాగా మద్యం తాగాడు. ఈ క్రమంలో ఒకరితో ఒకరు గొడవకు దిగుతూ అటుగా వచ్చే వాహనాలకు ఇబ్బంది కలిగించారు. ఈ విషయాన్ని వాహనదారులు పెట్రోలింగ్ పోలీసులకు సమాచారం అందించారు. అక్కడకు చేరుకున్న పోలీసులు వారిని మందలించి అక్కడినుంచి పంపించే ప్రయత్నం చేశారు. అయినా వాళ్లు వినికపోవడంతో ముగ్గురిని ఆటోలో, ఆరిఫ్‌ను కానిస్టేబుల్ తన వాహనంపై ఎక్కించుకుని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఆరీఫ్ పోలీస్టేషన్‌లోకి రాకుండా దాని ముందున్న బస్టాప్‌లో కూర్చున్నాడు. కొంత సమయం తర్వాత సదరు వ్యక్తి అపస్మారకస్థితిలోకి వెళ్లి కిందపడ్డాడు. అనుమానం వచ్చిన పోలీసులు 108 ద్వారా గాంధీ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అతను మృతి చెందినట్టు తెలిపారు. అతని తండ్రి నవీజ్‌వుద్దీన్‌ను ఆరా తీయగా ఆరిఫ్‌వుద్దీన్‌కు గతంలో రెండుసార్లు గుండెపోటు వచ్చిందని తెలిపారు. మద్యం మత్తులో నిద్రిస్తున్న సమయంలో గుండెపోటు వచ్చి ఒక్కసారిగా నేలకొరిగినట్లు పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

డిగ్రీ విద్యార్థిని అదృశ్యం

తిరుమలగిరి, మే 30 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ విద్యార్థిని అదృశ్యమైన సంఘటన తిరుమలగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ సంధ్య తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం రేచపల్లి గ్రామం లచ్చనయ్య తండాకు చెందిన శ్రీనివాస్ స్థానికంగా వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఆయన కూతురు శ్వేత (19) కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. వేసవి సెలవులు కావడంతో ఆమె స్నేహితులు మానస, సింధూజలు టెలికాలర్లుగా పని చేసేందుకు నగరానికి వచ్చి తిరుమలగిచౌరస్తాలో అద్దెకు ఉంటున్నారు. స్నేహితురాళ్ల వద్దకు వెళ్తానని కుటుంబసభ్యులకు చెప్పి ఈ నెల 28న ఊరి నుంచి శ్వేత నగరానికి వచ్చింది. మరునాడు సాయంత్రం ఊరికి వెళ్తానని స్నేహితులకు చెప్పి బయల్దేరింది. శ్వేత ఇంటికి రాకపోవడం.. మొబైల్ స్విచ్ఛాఫ్ చేసి ఉండడంతో అనుమానం వచ్చిన శ్రీనివాస్ తిరుమలగిరి పోలీసులకు శుక్రవారం రాత్రి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

షాపింగ్ చేస్తున్నట్లు నటించి.. మహిళ మెడలోని బంగారు గొలుసు చోరీ

ఉప్పల్, మే 30 (ఆంధ్రజ్యోతి): ఓ బ్యాంగిల్ స్టోర్‌లో షాపింగ్ చేస్తున్నట్లు నటించిన ఇద్దరు కిలాడి లేడీలు దుకాణం యజమానురాలి మెడలోని బంగారు గొలుసును లాక్కెళ్లారు. ఈ సంఘటన శుక్రవారం ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని విజయపురికాలనీలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. సాయిబాబా ఆలయం సమీపంలో బాకారం సంధ్య(40) బ్యాంగిల్ స్టోర్ నిర్వహిస్తోంది. శుక్రవారం మధ్యాహ్నం ఒకటిన్నర సమయంలో ఇద్దరు గుర్తుతెలియని మహిళలు వచ్చి గాజులు చూపించమని సంధ్యను అడిగారు, ఆమె పలు రకాల గాజులు చూపిస్తున్న సమయంలో ఆమె మెడలోని మూడు తులాల పుస్తెల తాడును లాక్కొని వెళ్లిపోయారు. దీంతో బాధితురాలు సంధ్య లబోదిబోమంటూ బయటకు వచ్చి ఇరుగుపొరుగు వారి సహాయంతో ఉప్పల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సంఘటన జరిగిన తీరును తెలుసుకుని సంధ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. నిందితులు ఇద్దరు గురువారం సదరు దుకాణంనకు వచ్చి గాజులు కొన్నట్లు నటించి లోపల, బయట పరిసరాలను గమనించి వెళ్లినట్లు పోలీసుల విచారణలో తేలింది.